

# మేడమ్ రోజ్‌హానీ

ఆంగ్లమూలం: ఖలీల్ జిబ్రాన్

తెలుగు అనువాదం: డా॥ రూప్‌కుమార్ డబ్బీకార్

అనువాదకథ

**మగాడి జీవితం ఎంత దుర్భరమైనది.**

**స్త్రీని ప్రేమించి, భార్యగా స్వీకరించి, ఆమె పాదాలను తన స్వేదంతో, రక్తంతో అభిషేకం చేసి హృదయపుష్పాన్ని అర్పించి తపించే మగాడు తాను రోజంతా చెమటోడ్చి, కష్టపడి సంపాదించిన ప్రతిఫలాన్ని మర్యాద అనే వస్త్రంలో మూటగట్టి ఆమె ఒడిలోకి అర్పిస్తే-**

**ఆ ఒడిలో వాలి సేదతీరుతున్న కళ్ళు, మరుసటి రోజు తెల్లవారేసరికి ఆమె హృదయం, తనదైన ప్రాణం మరో మగాడికోసం పరితపిస్తున్నదన్న నగ్న సత్యాన్ని దర్శించినపుడు కొండలాంటి ఆ మగాడి పిడికెడు గుండె ఎంతగా విలవిలలాడునో కదా!**

తన జీవితంలోని అనేక విలువల్ని, అమూల్యంగా, ప్రాణపదంగా అందిస్తే తను మాత్రం- తనదైన ప్రేమకోసం, తనదైన సౌఖ్యంకోసం, తనదైన శారీరక సుఖభోగాల కోసం, అయాచితంగా, మరో మగాడి ముందు పరిచిన పుష్పమైతే ఆ నిజం తెలుసుకొని అల్లాడిపోయే ఆ మగాడి జీవితం ఎంత దయనీయమైనది.

** ** **

స్త్రీ జీవితమూ దుర్భరమైనదే కదా!

ఇటు కల్లోల పెట్టే యవ్వనమూ, అటు అశ్రద్ధకు గురైన అందమూ ఒక మగాడి నీడలో-

తరగని సంపద, బంగారు నగలు, విలువైన రత్నాలు, తృటిలో మోకాలి ముందుకు వచ్చివాలే ఐహిక సుఖభోగాలు... ఇవేమియూ ఆ ఆత్మకు సంతోషాన్నందివ్వటంలేదు. మగాడి కంటి నుండి జాలువారే అమృతధార, ఆమె హృదయ కలశంలోకి వొంపబడినా ఆమెకు ఆనందాన్నివ్వటం లేదు.

** ** **

రషీద్ బె నమాన్- అతన్ని బాల్యం నుండి నేనెరుగుదును. లెబనీస్ జాతీయుడు. బేరూత్ (Beyrouth) నగరంలో జన్మించి అక్కడే పెరిగాడు. పూర్వీకుల సంప్రదాయాలను, యశస్సును నిలబెట్టుకోగలిగిన సనాతన, శ్రీమంతుల ఇంట్లో పుట్టిపెరగడం వలన తరచుగా తన తాత ముత్తాతల వైభవాన్ని తోటివారితో గొప్పగా చెప్పుకునే స్వభావం గలవాడు. దైనందిన జీవితంలో కూడ అప్పటి మధ్య తూర్పు (Middle East) ప్రాంతంలోని సంప్రదాయాలను, నమ్మకాలను పాటిస్తూ వారి బాటలోనే నడిచాడు.

రషీద్ బె నమాన్ విశాల హృదయుడు. వితరణశీలి. సిరియన్ పౌరుడిలాగే వాస్తవాలకు దూరంగా పైపై మెరుగులపైనే మక్కువచూపే స్వభావం గలవాడు. తన అంతరాత్మ ప్రబోధంకన్నా తనచుట్టూ ఉన్న పరిసరాల ప్రభావానికే లొంగిపోయే మనస్తత్వం. తాత్కాలిక సుఖభోగాలకు అలవాటుపడి, జీవిత లక్ష్యాన్ని గ్రహించి నడిచే సవ్యమైన దారిని తప్పినాడు. విలువైన, భౌతికమైన వస్తువుల్ని కూడబెట్టడం లోనే మునిగి జీవిత పరమార్థాన్ని చూడలేని గుడ్డివాడయ్యాడు. వాస్తవాలను అంచనా వేయకుండానే, ఎదుటివారిని అభిమానించడం, ద్వేషించడంలాంటి విషయాలలో తొందరపాటు నిర్ణయాలను తీసుకునే అనేకమందిలో ఇతనొక్కడయ్యాడు. తీరా తెలుసుకునేసరికి సరిదిద్దుకోలేని సమయం దాటిపోయేది. తత్ఫలితంగా అపార్థాలకు, అవమానాలకు గురయ్యేవాడు. ఇలాంటి లక్షణాలే, గుణవిశేషాలే రషీద్ బె నమాన్‌ను 'రోజ్ హానీ'ను పెళ్లాడటానికి ప్రేరేపించాయి. ఆమె ఆత్మ, అతని ఆత్మను పెనవేసుకోక ముందే ఒక హృదయం, మరో హృదయాన్ని అర్థం చేసుకోకముందే, నిజమైన ప్రేమ ఛాయలో రెండు హృదయాల సంగమం ఓ అలౌకికమైన స్వర్గాన్ని సృష్టిస్తుందన్న సత్యాన్ని గ్రహించకుండానే 'రోజ్‌హానీ'తో తన పెళ్ళిని నిర్ణయించుకున్నాడు.

** ** **

కొన్ని సంవత్సరాలు దొర్లిపోయాయి. 'బేరూత్' నగరానికి తిరిగి వచ్చిన నాకు 'రషీద్ బె నమాన్'ను దర్శించుకోవాలనే అభిలాషతో వెళ్ళి చకితుణ్ణయ్యాను. పాలిపోయిన మొహంతో చిక్కిశల్యామై వున్నాడు. అతని వదనంలో చేదు అనుభవాలతో నిండిన విషాద ఛాయలను ఎవరైనా గమనించవచ్చు. విచారంతో నిండిన అతని తునాతునకలైన హృదయాన్ని, ముక్కలైన ఆత్మని చూపుతున్నాయి- అతని ఈ దైన్యస్థితికి, దయనీయమైన పరిస్థితికి కారణమేమిటో తెలుసుకోవాలనే కోరిక కలిగింది. అడగ దానికి నేనేమి వెనుకాడలేదు.

"రషీద్, ఏమైంది నీకు-కోటికాంతుల్ని వెదజల్లే నీ నవ్వులు, బాల్యం నుండి ఆభరణంగా ఉన్న ఆ ఆనందం- అన్నీ ఏమయ్యాయి?! వీటన్నింటిని మృత్యువు నీ నుండి దూరం చేసిందా!? ఓ ప్రియమిత్రమా"

"మంచి రోజుల్లో కూడబెట్టిన, తళుకులీనే ఆ బంగారు సంపదను ఏ చీకటిరాత్రులు కొల్లగొట్టాయి?"

"మన స్నేహం సాక్షిగా చెప్పవూ"-

"చిక్కిపోయిన ఈ దేహం, బాధతో నిండిన నీ హృదయం- కారణం ఏమిటో చెప్పవూ"-

పశ్చాత్తాపం నిండిన కళ్ళతో నా వైపుకి చూచాడు.

అందమైన రోజుల్లోని, గతించిన జ్ఞాపకాల దృశ్యాలు అతణ్ణి తాకినట్లుగా- అంతులేని ఆవేదనతో, తడబడుతున్న గొంతుతో అతను సమాధానమిచ్చాడు.

"ఒక స్నేహితుణ్ణి కోల్పోతే, అతని జ్ఞాపకాలతో, ఇతర స్నేహితులతో మనకు మనంగా ఓదార్చుకోవచ్చు".

"బంగారాన్ని పోగొట్టుకుంటే తిరిగి సంపాదించుకోవచ్చు, లేదా ధ్యానముద్రనాశ్రయించి ఆ ధ్యాసను మనసు నుండి తుడిచిపెట్టేసుకోవచ్చు".

"కాని మనిషి తన హృదయాన్ని పోగొట్టుకుంటే, అతనిలోని మానసిక ప్రశాంతత కొల్లగొట్టబడితే తిరిగి సౌఖ్యాన్ని ఎలా పొందగలడు. దేనితో వాటిని భర్తీ చేసుకోగలరు?"

"ఏ ఆలోచనలతో జయించగలడు?"

"మృత్యువు ఎప్పుడైతే అతి దగ్గరకు వచ్చి పలకరిస్తుందో, అపుడే నిజమైన బాధ లోతును అనుభవించగలము".

"కాని, పగలు, రాత్రి అలా గడిచిపోతూ వుంటే- జీవితం సున్నితంగా, సుతారంగా నిన్ను స్పృశిస్తూ వుంటే, అపుడే బతుకునిండా నవ్వులు, ఆనందాలు, అనుభూతులు, విషాదాలను మోసుకువచ్చే విధివేటును ఊహించలేము. తీవ్రమైన చూపులతో, కాల్చివేస్తూ, వాడియైన గోళ్ళతో గొంతును నులిమేస్తూ, నేలకు గిరాటేసి తన ఇనుపపాదాలతో తొక్కివడేస్తూ, వికటాట్టహాసం చేస్తూ కదిలిపోతుంది. పోతూపోతూ ధనరాశిని నీ ముందు కుప్పగా పోసి పశ్చాత్తాపంగా క్షమార్పణని కోరుకుంటుంది. పట్టులాంటి తన మృదువైన హస్తాలతో నిన్ను గగనానికి మోస్తుంది. నీలో కొత్తఆశల్ని, నమ్మకాల్ని పుట్టిస్తుంది. సరికొత్త గమ్యాల్ని నిర్దేశిస్తుంది. జీవితంపై తిరిగి ఆశల్ని మొలకెత్తిస్తుంది. జీవితేచ్ఛ అందమైన పక్షియైతే, దానిని నీవు అమితంగా ప్రేమిస్తే నీ హృదయ, మనోపంజరంలో ఆత్మను గూడుగా కట్టి, ఆనందంగా నీ అంతరాత్మనే గింజలుగా చల్లి ఆకలి తీర్చుతావు".

"కాని, మిత్రమా!

జీవితాన్ని ఎంత ప్రేమగా, ఆర్తిగా ఆరాధిస్తావో, అది అంత కఠినంగా నీ నుండి తప్పించుకొని అందని తీరాలకు ఎగిరిపోతుంది. మరొక హృదయ పంజరంలోకి ప్రవేశిస్తుంది. అది ఎప్పటికీ నీ దరికి తిరిగిరాదు!"

"నీవేమి చేయలేని నిస్సహాయ స్థితిలో ఉంటావు"

"ఉరిమి, ఓదార్పుల అన్వేషణలో పిచ్చివాడవై జ్వలిస్తావు!"

"నీ కలల్ని, ఆశల్ని తిరిగి నిర్మించుకోలేనంతగా బూడిదైపోతావు?!"

"భీకర తుఫానుకు గురై కల్లోలితమైన ఈ హృదయ సాగరాన్ని- ఏ శక్తి శాంతపరచగలదు?"

గద్గద స్వరంతో పలికిన ఈ మాటలు; ప్రచండగాలి తుఫానుల మధ్య విలవిల్లాడిపోతూ, వణికిపోతున్న గడ్డిపోచలా రషీద్ బెనమాన్ ఆత్మ ఘోషించిందా అన్నట్లుగా వినబడ్డాయి. వేళ్ళను మడిచి వేటినో నులిమి నుజ్జు నుజ్జు చేయాలనే కసితో తన రెండు చేతులను ముందుకు చాచాడు. ముడుతలు పడిన అతని ముఖం, ఉగ్రరూపం దాల్చిన అతని కళ్ళు తీక్షణంగా చూస్తున్నాయి. అగ్నిని వర్షించడానికి సిద్ధంగా ఉన్న అతని కళ్ళల్లో, అగోచరమైన లోకం నుండి తనపై దాడి చేస్తున్న ఒక రాక్షసిని ఎదుర్కోవాలనే తీవ్రమైన అలజడి. కాని, అంతలోనే తన దృష్టిని నా వైపుకి మరల్చాడు. అతని ముఖంలోని తుఫాను అలజడి హోరు తగ్గి ఒక సన్నని బాధ, వేదన అతన్ని నా ఒళ్ళోకి చేర్చింది. గాయపడిన ఆత్మ నా ఒడిలో వెక్కిళ్ళుగా ఏడ్వసాగింది.

రోదిస్తూ- "నా ఈ దుస్థితికి కారణం ఆడది. ఏ ఆడదాన్నైతే, పేదరికమనే మృత్యుకోరల్లోంచి తప్పించినానో, ఏ ఆడదానికోసం నా భాండాగారాల ద్వారాలు తెరిచి స్త్రీ జాతి మొత్తం తనని చూచి అసూయపడేలా చేసానో, ఏ ఆడదానికోసం అద్భుతమైన వస్తు,

ఏ ఆడదాన్నైతే, పేదరికమనే మృత్యుకోరల్లోంచి తప్పించినానో, ఏ ఆడదానికోసం నా భాండాగారాల ద్వారాలు తెరిచి స్త్రీ జాతి మొత్తం తనని చూచి అసూయపడేలా చేసానో, ఏ ఆడదానికోసం అద్భుతమైన వస్తు, వాహన కనకాలు, విలువైన రత్నాల రాగులు సమర్పించుకున్నానో, ఏ ఆడదాని పాదాల ముందు నా ప్రేమరాశుల్ని కుప్పగా పోశానో, ఏ ఆడదానితోనైతే నిజమైన స్నేహితుడిలా, నిజాయతీ గల సహచరుడి గా, విశ్వాసం గలిగిన భర్తగా మసలుకున్నానో ఆ ఆడదే నన్ను వంచించింది.

వాహన కనకాలు, విలువైన రత్నాల రాశులు సమర్పించుకున్నానో, ఏ ఆడదాని పాదాల ముందు నా ప్రేమరాశుల్ని కుప్పగా పోశానో, ఏ ఆడదానితోనైతే నిజమైన స్నేహితుడిలా, నిజాయతీగల సహచరుడిగా, విశ్వాసం గలిగిన భర్తగా మసలుకున్నానో ఆ ఆడదే నన్ను వంచించింది. నన్ను, నా సర్వస్వాన్ని కాదని, కాలదన్ని మరోమగాడి పంచన చేరి స్వార్థంతో నిండిన అతని రొట్టెముక్క కోసం లజ్జాహీనురాలై, నీచంగా ప్రవర్తించింది. ప్రాణానికి ప్రాణంగా ప్రేమించిన స్త్రీ, సుపర్ణి- నా హృదయాన్ని పంజరంగా చేసి, అందులో నా ఆత్మని గూడుగా కట్టి ప్రాణంకన్నా మిన్నగా చూసుకుంటున్నా, నా నుండి తప్పించుకొని నా ప్రేమగూటిని వదిలి మరో గూటిలోకి చేరిపోయింది. నా అనురాగపు స్వర్గాన్ని వదిలిన ప్రేమదేవత ఇపుడు నా కంటికి, తను చేసిన పాపకర్మలకు ప్రతిఫలంగా చీకటి గుయ్యారంలోకి తోయబడిన రాక్షసిలా కనబడుతోంది. తనను ప్రేమించిన పాపానికి శిక్షగా నన్ను ఈ భూమ్మీద నరకయాతనకు గురికమ్మని వదిలిపెట్టింది".

రషీద్ తననుండి తాను తప్పించుకోవడానికి రెండు చేతులతో ముఖాన్ని దాచుకున్నాడు. ఓ క్షణకాలం మౌనంగా ఉండి, కాస్త తెప్పరిల్లి తిరిగి చెప్పడం మొదలుపెట్టాడు.



"మిత్రమా! ఇంతకుమించి నేనేమి చెప్పలేను! ఇంకా చెప్పమని దయచేసి నన్ను అడగవద్దు".

"నా దురదృష్టానికి నన్ను వదిలెయ్యి. బహుశా, నా నుదుటిపై ఈ మృత్యు నిశ్శబ్దమే లిఖించబడినట్లుంది. చివరికి ఆ నిశ్శబ్దంలోనే దీర్ఘ ప్రశాంతతో, శాంతి స్వర్గంలో నిద్రపోవాలనే విధిరాతను ఎవరు మార్చగలరు?"

అశ్రుపూరిత నయనాలతో, అతనిపై జాలి, కరుణ నిండిన హృదయంతో మౌనంగానే వీడ్కోలు పలికాను. ఎందుకంటే గాయపడిన అతని గుండెను సాంత్వన చేకూర్చే శక్తి, ఓదార్చే బలం నా మాటలకు లేవు. అతని చీకటి బతుకులో వెలుగులు చిందించే దీపశిఖలుగా నా మాటలు కాలేవు.

## రెండవ భాగం

కొన్ని రోజుల తర్వాత మేడమ్ రోజ్ హనీని కలుసుకోవాలని వచ్చిన నాకు కనిపించిన దృశ్యం. చిన్న పూరిల్లు. పూలు నిండిన తీగలతో, చుట్టూ వృక్షాలతో ప్రశాంత ఆశ్రమాన్ని మరిపిస్తోంది. రషీద్ బేనమాన్- ఏ హృదయాన్నైతే కర్కశంగా ముక్కలుగా చేసిందో, ఏ జీవితాన్ని దురదృష్టమనీ ఇనుపడెక్కలకింద నలిపి పారేసిందో- ఆ రషీద్ ద్వారా నా గురించి వినడమే గాని తను నన్నెన్నడూ చూడలేదు. నేనూ ఆమెను చూడటం ఇదే మొదటిసారి. అందమైన మెరిసే ఆ కళ్ళు, మృదువుగా నిజాయతీని ధ్వనిస్తున్న ఆమె కంఠస్వరం- నా మనసులో ఎన్నో ప్రశ్నలు పుట్టుకొచ్చాయి.

"ఈ సుకుమారి నీచమైన ప్రవర్తన కలిగియుండటమా."

"ఈ అందమైన ముఖవర్చస్సు వెనకాల ఒక కర్కశమైన హృదయం, ఒక వికారమైన ఆత్మ ఉండటం సాధ్యమా?"

"ఈమె విశ్వాసహీనురాలైన భార్యనా."

"ఈ స్త్రీయేనా! ఎవరి గురించి నేను చెడుగా ఊహించుకున్నానో;

ఎవరిని నేను- ఒక అందమైన పక్షిరూపంలో ఉన్న విషసర్పంగా భావించుకున్నానో"


నా మనసు నన్ను తిరిగి సమాధానపరచటం మొదలుపెట్టింది.

"రషీద్ జీవితాన్ని దుర్భరమయం చేసింది అద్భుత సౌందర్యాన్ని ఒలకపోసే ఈ వదనమే గదా!"

"అందం, తన విషపు కోరలతో కాటువేసి ఎన్ని జీవితాలను ఆవేదనకు గురి చేసిందో చెప్పడానికి గత చరిత్రలు సాక్ష్యంగా లేవూ-"

"కవుల హృదయాలను ప్రేరేపించే వెన్నెలరేడు, నిశ్శబ్దంగా, ప్రశాంత గంభీరంగా ఉండే సాగరుణ్ణి అల్లకల్లోలం చేయడూ?!"

మేము అలా కూర్చున్న మరుక్షణమే, నా హృదయ స్పందనలు వినబడినట్లుగా, నా భావాలను పసిగట్టినట్లుగా, నాలోని సందేహాల ప్రవాహాన్ని మరింత ముందుకు సాగకుండా అడ్డుకట్ట వేస్తూ, కోకిల పాటకన్నా తీయనైన కంఠస్వరంతో ఇలా చెప్పసాగింది. "నిన్నెపుడూ చూడటం జరగలేదు. కానీ నీ ఆలోచనలను, నీ కలలను, ఆశయాలను నలుగురి ద్వారా విన్నాను. వారి మాటలు నీపై నాలో నమ్మకాన్ని కలిగించాయి. ఎదుటివారి మనసును అర్థం చేసుకునే సున్నితమైన గుణం, వివక్షకు బలవుతున్న ఆడదాని హృదయరహస్యాలను




**ఆడదాని సంతోషం, మగాడి హోదాలోనో, సంపదలోనో లేదని, అతని ఉదారత్వంలోనో, కేవలం ఏకోన్ముఖమైన అతని ప్రేమలోనో ఉండదని నేను తెలుసుకోగలిగాను. ప్రేమంటే రెండు హృదయాలు ద్రవించి ఏకమయ్యే స్థితి, ప్రేమంటే రెండు శరీరాలు ఒక్కటై ఆత్మగా వెలిగే స్థితి. రెండు ఆత్మలు ఏకపదమై భగవంతుడి అధరాలపై ధ్వనించే శబ్దం.**

ఆవిష్కరించగలిగే ఔన్నత్యం, స్త్రీ ప్రేమను అర్థం చేసుకోగల హృదయ లాలిత్యం నీకు అపారం. అటువంటి వ్యక్తిముందు నా హృదయాన్ని విప్పిచూపనీ. అపుడైనా 'రోజ్‌హనీ' ఎంతమాత్రం విశ్వాసహీనురాలు కాదన్న నిజాన్ని నీవు తెలుసుకోగలవు".

"విధి నన్ను నిర్దయంగా రషీద్ బెనమాన్ చేతిలో పడవేసినపుడు నాకు పద్దెనిమిదేళ్ళు కూడా పూర్తిగా నిండలేదు. రషీద్ వయసు అపుడు నలభైయేళ్ళు. అతను నన్ను ప్రేమించాడని నలుగురు చెప్పుకొనగా విన్నాను. నాపై కేవలం అతనికి గల ప్రేమను మాత్రమే అంగీకరించిన పెద్దలు నన్ను అతని భార్యగా చేసి భవ్యమైన భవంతిలో ఉంచారు. నా ఆలనా పాలనా చూసుకోవడానికి దాసదాసీ జనం. అలంకారాలకై ఖరీదైన చీనీ చీనాంబరాలు, విలువైన రత్నాలు, ఆభరణాలు. అతని బంధుమిత్రుల నివాసాలలో ప్రదర్శనకుంచబడిన ఒక అరుదైన వస్తువునయ్యాను. రషీద్ సహచరులు, నన్ను, నా అందాన్ని చూసి సంభ్రమాశ్చర్యాలకు గురైతే అతని ముఖంపై విజయ దరహాసం వెలిగేది. ఆడవాళ్ళు, అభిమానంతో నన్ను పొగడ్తలతో ముంచెత్తుతూ ఉంటే విని అతని తల గర్వంతో పైకెగసేది. కాని దురదృష్టకరమైన విషయమేమిటంటే అతనెప్పుడూ, నలుగురు మా వెనుక మాట్లాడుకునే గుసగుసలు వినలేదు. 'ఈ అమ్మాయి రషీద్ బెనమాన్ భార్యనా లేక దత్తపుత్రికా' అన్న వారి మాటల విసుర్లు అతని చెవులకెప్పుడూ చేరలేదు".

"సరియైన వయసులో పెళ్ళి చేసుకుంటే ఈతని పెద్దకూతురు 'రోజ్ హనీ' కన్నా పెద్దవయసులోనే వుండేది. చోద్యం కాకపోతే"- అంటూ మరికొందరు వ్యాఖ్యానించేవారు".

"ఈ జీవితంలో- యవ్వనప్రాయమనే గాఢ నిద్రావస్థలో నుండి మేల్కొనకముందే, ప్రేమ అనే అగ్నిశిఖతో నా హృదయాన్ని ఆ భగవంతుడు జ్వలింపచేయకముందే, నాలో ప్రేమాంకురాలు జీవం నింపుకోకుండానే ఇదంతా నా ప్రమేయం లేకుండానే జరిగిపోయింది. అవును, నిజమైన ఆనందం అంటే కొత్తబట్టల్లో ఉంటుందని; అందమైన, విశాలమైన భవంతుల్లోనే ఉంటుందని భ్రమించే వయసులోనే ఇదంతా జరిగిపోయింది.

నిద్రాణమైన బాల్యావస్థ నుండి మేల్కొనగానే పవిత్రమైన ప్రేమ జ్వాలాగ్నులు నా హృదయాన్ని కాల్చివేస్తున్నాయన్న అనుభూతిని నేను గ్రహించగలిగాను. ఐహికం కాని ఆకలి ఏదో నా ఆత్మను నమిలివేస్తుందని, బాధిస్తుందని, భావించగలిగాను. ఎప్పుడైతే నేను కళ్ళు తెరిచానో అపుడు గ్రహించగలిగాను- కుడి ఎడమలుగా కదులుతున్న రెక్కలు, అనంతమైన ఎత్తులకు ఎగిరి స్వర్గసౌఖ్యాలకు నిలయమైన ప్రేమసామ్రాజ్యంలోకి అడుగు పెట్టాలని ఉబలాటపడుతున్నాయని. కాని, ఈ దేహం ఒక పురుషుడితో సామాజిక, సంప్రదాయిక బంధనాల్లో బిగించబడినదని, అవి తెంచుకోలేని ఇనుప సంకెళ్ళని తెలియగానే వణుకుతూ, ఆ చట్టం చట్రం ముందు లొంగిపోయాయి. ఆడదాని సంతోషం, మగాడి హోదాలోనో, సంపదలోనో లేదని, అతని ఉదారత్వంలోనో, కేవలం ఏకోన్ముఖమైన అతని ప్రేమలోనో ఉండదని నేను తెలుసుకోగలిగాను. ప్రేమంటే రెండు హృదయాలు ద్రవించి ఏకమయ్యే స్థితి, ప్రేమంటే రెండు శరీరాలు ఒక్కటై ఆత్మగా వెలిగే స్థితి. రెండు ఆత్మలు ఏకపదమై భగవంతుడి అధరాలపై ధ్వనించే శబ్దం. ఈ నిజం తెలుసుకునేలోగానే రషీద్ బెనమాన్ భవంతిలో నన్ను నేను బందీగా, పెళ్ళి పంజరంలోని ఖైదీగా, అతని రొట్టెను దొంగతనం

చేసిన దొంగలా, చీకటిరాత్రుల సహవాసంలో తెలియని మూలల్లో దాక్కున్న దోషిలా నిలబడ్డాను. భూమ్యాకాశాల సాక్షిగా నాకు తెలుసు- నేను అతనితో గడిపిన ప్రతిక్షణం నా నుదుటి మీద జ్వాలాక్షరాలతో లిఖించబడిన ఒకానొక భయంకరమైన అబద్ధమని. అతను చూపిన ఔదార్యానికి, అతని ప్రేమలోని నిజాయతీకి ప్రతిఫలంగా నా ప్రేమని, అనురాగాన్ని పంచివ్వలేకపోయాను. అతణ్ణి ప్రేమించాలని ప్రయత్నించి ఓడిపోయాను. హృదయాలను స్పందింపజేసే, చలింపజేసే అపారమైన శక్తి ప్రేమకు గలదు. కాని ప్రేమను జ్వలింపచేసే శక్తి ఈ హృదయాలకు లేదు. రాత్రుల నిశ్శబ్దాలలో మౌనంగా ఆ భగవంతుడితో ప్రార్థించి, ప్రార్థించి అలసిపోయాను. ఓ భగవంతుడా! నా కోసమే నా జీవిత భాగస్వామిగా నిర్ణయించబడిన వ్యక్తి దగ్గరకు చేర్చు. నా గుండె లోతుల్లో అతనిపై పవిత్రమైన ప్రేమను కలగనీ! జీవన తాత్వికతనై నన్ను అతని దగ్గరకు, అతి దగ్గరకు, అతి చేరువకూ చేరనీ!"



"నా మొర ఆలకించలేదు. ఎందుకంటే భగవదేచ్ఛతో మాత్రమే ప్రేమామృతం మన ఆత్మకలశాల్లోకి వొంపబడుతుంది. వ్యక్తుల అధికార, ధిక్కారాలతో కాదు. నన్ను చూసి నా స్నేహితులు, సహచరులు ఈర్ష్యాసూయలు పడుతుంటే, బంగారు పంజరంలో చిక్కిన పక్షిలాంటి నేను మాత్రం అసూయతో పచ్చని పొలాలపై స్వేచ్ఛగా ఎగిరే పక్షుల్ని చూస్తూ ఆవేదనతో అతని భవంతిలో రెండు సంవత్సరాలు గడిపాను. అప్పటి నా పరిస్థితి, నా బాధ- ఒక్కగానొక్క సంతానాన్ని కోల్పోయి గుండెకోతకు గురైన తల్లిలాంటిది. అన్ని బంధాలు తెగిపోయి, నైరాశ్యంతో కుమిలిపోతున్న, గాయపడిన గుండెలాంటిది. మానవజాతి చేసుకున్న కట్టుబాట్ల మధ్య బలైపోతున్న ఒక అమాయక ప్రాణిలాంటిది. ఆధ్యాత్మికమైన ఆకలిదప్పులకు దూరమై మృత్యువుకు దగ్గరయ్యాను".

"గాఢాంధకారం అలుముకున్న ఒకానొక రోజు. గతాన్ని కమ్ముకున్న దట్టమైన కారుమబ్బుల వెనుక, అన్నీ కోల్పోయి బతుకుబాటలో పయనిస్తున్న ఒకానొక వ్యక్తిని చూశాను. అతని కళ్ళలో, వర్షిస్తున్న కాంతిని చూశాను. అద్భుతమైన ఆ కాంతిని చూస్తూ కళ్ళు మూసుకున్న నేను, నాలో నేనుగా గొణుక్కున్నాను; ఓ నా హృదయమా! సమాధుల చీకటియే నీ అదృష్టానికి రాసిపెట్టబడియున్నది. ఈ వెలుగుకై ఆశపడకు'. అంతలోనే ఓ అందమైన సుస్వరగీతం- ఊర్ధ్వ లోకాలనుండి తన స్వచ్ఛతతో గాయపడిన నా గుండెను స్పర్శిస్తూ సేదతీరుస్తోంది. కాని, నేను నా చెవుల్ని మూసుకున్నాను; 'ఓ నా హృదయమా! అగాధుల లోతుల్లోని శోకగీతాలే కదా విధి నీకు ధారపోసింది. సుందర స్వర్గసీమల మాధుర్యాల గీతాలాపనల కోసం అర్రులు చాచకు". మళ్ళీ మళ్ళీ చూడకూడదని నా కళ్ళని మూసుకున్నాను. వినకూడదని నా చెవులను మూసుకున్నాను. కాని మూయబడిన నా కనె్రప్పల ముందు ఆ అద్భుతమైన సన్నటి కాంతిరేఖలు కనబడుతూనే వున్నాయి. మూయబడిన నా చెవులు దైవికమైన సుస్వర శబ్దాల నాలకించకుండా ఉండలేకపోయాయి. మొదటిసారిగా ఎన్నడూ లేని భయం నన్ను ఆవహించింది. సుల్తాను భవంతి ముందు విలువైన నగ దొరికిన ఒక యాచకునికి కలిగే భయంలాంటిది. పేదరికం తీసుకోవాలని ఆరాటపెడుతుంది. అదే పేదరికం వద్దని వారిస్తుంది. నేను గట్టిగా ఏడ్చాను. నా రోదనా పరిస్థితి ఎలా ఉండేదంటే ప్రవహించే ఏటిచుట్టూ ఉన్న క్రూరమృగాలను చూస్తూ, నిరీక్షిస్తూ, భయం భయంగా దప్పికగొన ఆత్మలా- ఉండేది".

నా నుండి గతాన్ని గుర్తుకు తెచ్చుకుని, తను చేసిన పని సరియైనది కాదేమోనన్న తలంపుతో సిగ్గుపడుతూ నా చూపుల్ని ఎదుర్కొనలేక, ఆమె తన చూపులను మరల్చుకొంది. ఐనా, చెప్పడం మాత్రం ఆపలేదు. "నిజమైన జీవన మాధుర్యాన్ని చవిచూడకుండానే కాలాంతానికి చేరుకోవాలనుకునేవారు ఆడదాని అంతరంగాన్ని అర్థం చేసుకోలేని అసమర్థులు. ముఖ్యంగా, ఏ ఆడది, భగవంతుడి ఇష్టానుసారం తాను ఆరాధిస్తున్న మగాడికి తన ఆత్మను; సమాజం సృష్టించుకున్న చాంధస నియమాలకు బందీయై మరో పురుషుడికి తన శరీరాన్ని అప్పగించుకుంటుందో ఆ స్త్రీ బాధల్ని, అంతరంగాన్ని అర్థం చేసుకోవడం అంత సులభం కాదు. ఇది స్త్రీ కన్నీటితో రక్తాక్షరాలతో లిఖించబడిన విషాద గాథ. ఒకవేళ అర్థం చేసుకున్నా అతనిలోని అజ్ఞానం, మూర్ఖత్వం అతన్ని భగవద్వేషిగా మార్చి, స్త్రీ హృదయాన్ని మరింతగా క్షోభకు గురిచేస్తాయి. శరీరాన్ని భర్త అనే సంకెళ్ళతో ఓ పురుషుడితో కట్టి పడేసి ఆడదాని ఆత్మ అనే వేదిక మీద చీకటి రాత్రుల్లో విధి ఆడుతున్న వింతనాటకం ఇది. ఏ మగాణ్ణి తను హృదయపూర్వకంగా ఆరాధిస్తుందో, మనసా, వాచా ప్రేమకై తపించిపోతుందో ఆ మగాడిలోనే తన ఆత్మను దర్శించుకోవాలని ఉబలాటపడుతుంది స్త్రీ. పురుషాధిక్య ప్రపంచంలో, స్త్రీలోని అబలత్వం అంతులేని ఆవేదనల్ని మాత్రమే మిగుల్చుతుంది. బలవంతులు తమ అధికార బలంతో, బలహీనులను తమ బానిసలుగా చేసికొని సేవ చేయించుకునే దౌర్జన్యం నశించనంతవరకు ఈ దుర్మార్గానికి అంతంలేదు. ఇది మానవ సమాజంచే సృష్టించబడిన అవినీతిమయమైన, నీచమైన కట్టుబాటు; మరియు పవిత్రప్రేమ, ఉత్కృష్టమైన హృదయ సంవేదనల మధ్య పవిత్రమైన ఉద్దేశంతో జరుగుతున్న భయంకరమైన యుద్ధం. అటువంటి యుద్ధరంగంలో నిన్నటి రోజు వరకు పడివున్న నేను, శకలాలుగా మిగిలియున్న నా శక్తిని కూడగట్టుకొని, పిరికితనమనే ఇనుపసంకెళ్ళ నుండి విడివడి బలహీనతల బంధనాల త్యజించి, రెక్కలను కూడగట్టుకొని, స్వేచ్ఛా సంకల్పంతో, ప్రేమానురాగాలు నిండిన విశాల గగన వీధుల్లోకి ఎగిరిపోయాను".

"ఈరోజు నేను కోరుకున్న వ్యక్తితో ఆనందంగా ఉన్నాను; సృష్టికి పూర్వం ఆ భగవంతుడి చేతిలోంచి జారిపడిన దీపశిఖలా మేమిద్దరం. ఈ విశ్వాంతరాలలో ఏ శక్తి నా ఆనందాన్ని నా నుండి దూరం చేయలేదు. ఎందుకనగా, అనురాగపు కాంతుల్ని వెదజల్లుతూ, స్వర్గంచేత రక్షింపబడుతూ మా రెండు ఆత్మలు ఏకమై ఉన్నాయి".

ఆమె తన చూపును నా వైపుకు సారించింది. తీక్షణమైన ఆ చూపులు నా హృదయాన్ని చీల్చుకుపోతున్నట్లు, తన మాటల ప్రభావం నా మనసుమీద ఏ విధంగా ముద్రించబడిందో తెలుసుకోవడానికి, ఆమె మాటలు నా అంతరంగంలో ఏవిధంగా ప్రతిధ్వనిస్తున్నాయో వినడానికి ఉత్సుకతను చూపుతున్నాయి. ఆమె గొంతు చేదు జ్ఞాపకాలతో, స్వేచ్ఛ, నిజాయితీతో కూడిన తియ్యదనంతో నిండివుంది. "రోజ్‌హనీ అంటే సంప్రదాయాలను గౌరవించని స్త్రీ అని, విశ్వాసఘాతకియని, తుచ్ఛమైన కోరికలకోసం తన సర్వస్వాన్ని త్యాగం చేసి తనవంశమర్యాదకు ప్రతీకగా, సమాజంలో స్థాయిని, గౌరవప్రదమైన స్థానాన్ని కల్పించిన భర్తను వదిలిన ఆడది అని ఈ సమాజం నన్ను చీదరించుకోవచ్చు. పవిత్రమైన వివాహబంధాన్ని మలినపరిచి, నరకకూపంలోకి ప్రవేశించిన కులట, వ్యభిచారిణి అని జనం అంతా మీతో అనవచ్చు. మర్యాద అనే వస్త్రాలను విసిరి వేసి పాప పంకిలమైన, అమర్యాదకరమైన వస్త్రాలను ధరించిన వగలాడి అని తూలనాడవచ్చు. ఇంతకన్నా ఎక్కువగానే నా గురించి నిందించ వచ్చు. ఎందుకంటే, వారి మనసుల్లో ఇంకా వారి పూర్వీకుల ప్రేతాత్మలే కదా నివసించేది!?"

*శరీరాన్ని భర్త అనే సంకెళ్ళతో ఓ పురుషుడితో కట్టి పడేసి ఆడదాని ఆత్మ అనే వేదిక మీద చీకటి రాత్రుల్లో విధి ఆడుతున్న వింతనాటకం ఇది. ఏ మగాణ్ణి తను హృదయపూర్వకంగా ఆరాధిస్తుందో, మనసా, వాచా ప్రేమకై తపించిపోతుందో ఆ మగాడిలోనే తన ఆత్మను దర్శించుకోవాలని ఉబలాటపడుతుంది స్త్రీ.*

(ముగింపు వచ్చేవారం)